ప్రజాశక్తి
మంగళవారం 6 ఆగస్టు 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

కౌలు రైతు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారి

ప్రజాశక్తి-దర్శి

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దర్శి మండలంలోని పోతవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మందా నాగరాజు (26) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. రూ.పది లక్షల వరకూ అప్పులున్నాయి. పంటలు సరిగా పండక నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేకపోయారు. అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఉరేసుకొని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రైతు మృతితో పోతవరం ఎస్‌సి కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి.

త్వరలో గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు ఏర్పాటు

మంత్రులు నిమ్మల, గొట్టిపాటి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దెబ్బతిన్న గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లను త్వరలో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర నీటిపారుద శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజల వరప్రదాయని గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష చేపట్టారు. జిల్లా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తో కలిసి గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పై మంత్రి రామానాయుడు సమీక్షించారు. అమరావతిలోని ఏపి సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మంత్రులు ఇరువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులపై చేపట్టిన సమీక్షలో భాగంగా గుండ్లకమ్మ ప్రాజెక్ట్ స్థితిగతులపై మంత్రులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రాజెక్టు గేట్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి సాగు నీటిని అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం కషి చేస్తోందని పేర్కొన్నారు.


బాపట్ల కలెక్టరేట్ వద్ద స్కీం వర్కర్ల ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

బీదబిక్కీ అనేదీ చూడటం లేదు. ఇప్పటి వరకూ ఆ పేద కుటుంబాలు జీవనం సాగించే అంశంపైనా దృష్టిలేదు. ఉన్న చిన్న ఉపాధి పీకేస్తే వాళ్ల కడుపుకొట్టామనే బాధ కూడా కనిపించడం లేదు.

ఎడాపెడా తొలగింపులు

- కన్నీరు పెడుతున్న చిరుద్యోగులు
- బీదబిక్కీ అనే తేడా లేకుండా పీకేస్తున్న వైనం
- గ్రామాల్లో పాలకపక్ష నేతల అధికారదాహం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

గ్రామాల్లో నామినేటెడ్ లేదా కాంటాక్టు పద్ధతిపై పనిచేస్తున్న చిన్నచిన్న ఉద్యోగులను ఎడాపెడా తొలగిస్తున్నారు. అధికారం మారిందనే అహం ఒక్కటే కనిపిస్తోంది. మావాళ్లకు ఇచ్చుకోవాలి. మీరు తప్పుకోండంటూ టిడిపి నాయకులు హుకుంలు జారీ చేస్తున్నారు. తప్పుకోకున్నా అధికారులతో తప్పిస్తున్నారు. ఉన్నపళంగా ఉపాధి పోవడంతో ఆ పేద కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. జీవనం ఎలా అనే దిగాలుతో ఉన్నారు. గతంలో వైసిపి చేసిన తప్పిదాలే ఇపుడు తెలుగుదేశం నేతలు చేస్తున్నారు.జనం అధికారాన్ని మార్చింది ఇందుకోసమేనా?అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై ఎమ్మెల్యేలూ మౌనంగా ఉన్నారు. మంత్రులకూ పట్టడం లేదన్న చర్చ సాగుతోంది. కలెక్టరేట్ల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు ఆందోళనకు దిగుతున్నారు. తమగోడు వినాలని మొర పెట్టుకుంటున్నారు. వాస్తవానికి వీరిలో ఎక్కువ శాతం మంది పేదలే. డీలర్లు మినహాయిస్తే మిగతా రంగాల్లో పనిచేసేవారిలో ఎక్కువ శాతం ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు ఉన్నారు. అందరినీ తప్పిస్తున్నారు. రేషన్‌డీలర్ల నియామకం రాజకీయం గానే జరుగుతుంది. గతంలో వైసిపి అధికారం లోకి రాగానే అప్పటి వరకూ ఉన్న డీలర్లను తప్పించారు. కొత్తగా వైసిపి నేతలను తీసుకున్నారు. ఇపుడు వాళ్లను పీకేసి తెలుగుదేశం నేతలను తీసుకుంటున్నారు. వీటి విషయంలో రాజకీయంగానే జరిగే ప్రక్రియే. దీనిపై పెద్దగా జనంలో చర్చలేదు. అయితే పాఠశాలల్లో పనిచేసే వంట వాళ్లను కూడా తప్పిస్తున్నారు. ఇదే విడ్డూరంగా ఉంది. వాళ్లేమైనా వైసిపి కార్యకర్తలా? అంటే ఏమీకాదు. పార్టీలకు అతీతంగా ఉన్నవాళ్లే. చాలా కాలంగా రాజకీయాలకు సంబంధం లేకుండా పనిచేసే వర్కర్లను కూడా తీసేస్తున్నారు. అధికారం మారినందున తమ వాళ్లను పెట్టుకోవాలన్న లక్ష్యం ఒక్కటే కనిపిస్తోంది. వాళ్ల ఉపాధిని దెబ్బకొడుతున్నామనే ఆలోచన కొంచమైనా కనిపించడం లేదు. ఉద్యోగులు అందరూ గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. అందరూ కూటమి వైపే మొగ్గు చూపారు. ఏస్థాయిలో అంగన్‌వాడీలు ఆందోళన చేశారు? తెలుగుదేశం నేతలు మద్దతు ఇవ్వలేదా? వాళ్లంతా ఎవరికి ఓటేశారన్నదీ తెలిసినా కూడా వారిపైనా వేధింపులు మొదలయ్యాయి. స్కీం వర్కర్లు అందరూ ఉద్యోగులు చెప్పినట్లే విన్నారు. ఎవరికి ఓటేశారన్నదాని కంటే కూటమి అధికారంలోకి రావడానికి వీళ్లపాత్ర కూడా ఉందనడంలో సందేహం లేదు. ఇవన్నీ ఇపుడు పాలకపక్ష నేతలకు పట్టడం లేదు.గ్రామాలో తెలుగుదేశం నేతలు ఏది చెబితే దాన్ని ఎమ్మెల్యేలు వింటున్నారు. జాబితాలు సిద్ధం చేసి తొలగిస్తున్నారు. కొత్తగా పార్టీ అనుచరులను పెట్టు కుంటున్నారు. డీలర్లను దాదాపుగా మార్చేశారు. విఒఎలు 1000 మంది వరకూ ఉంటే ఇప్పటికే 300మందికి ఇంటికి పంపారు. మిగతా వారిని తప్పించే యత్నాలు జరుగు తున్నాయి. స్వచ్ఛభారత్ ▶ 2లో



మాట్లాడుతున్న చుండూరి రంగరావు

వ్యవసాయ రంగం నుంచి ...

కార్పొరేట్లను తరిమికొట్టండి

- 9న క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని జయప్రదం చేయండి
- ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ రంగారావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వ్యవసాయ రంగం నుంచి కార్పొరేట్లను తరిమికొట్టాలఁ సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపుఁచ్చారు. రైతులు, వ్యవసాయ కూలీల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్ శక్తులకఁ దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వాఁకి వ్యతిరేకంగా ఈనెల 9న ఁర్వహిస్తున్న క్విట్ కార్పొరేట్ ఉద్యమాఁ్న జయప్రదం చేయాలఁ కోరారు. ఒంగోలు ఎల్‌బిజి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం సోమవారం ఁర్వహించారు. ఈ సందర్భంగా ▶ 2లో

7న చీరాలకు సిఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి-చీరాల



సిఎం చంద్రబాబు బుధవారం చీరాల పర్యటనకు రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చీరాలలో అధికారికంగా నిర్వహించే చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికయ్యాక చీరాల పర్యటనకు రావటం ఇదే ప్రథమం. సిఎంఒ నుంచి అందిన సమాచారం మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు చీరాలలో సోమవారం సిఎం సభకు అనువైన ప్రదేశం కోసం విఆర్ఎస్ అండ్‌వైఆర్ఎన్ కళాశాల, మరియు పట్టణంలోని ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ స్థల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

వ్యవసాయం రంగం నుంచి
కార్పొరేట్లను తరిమికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

రంగారావు మాట్లాడుతూ 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కఠినంగా అమలు చేస్తుందన్నారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 38,39 ల ప్రకారం దేశ సంపద ప్రజలకు విద్య, వైద్య, ఉపాధి కల్పనకు వినియోగించాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా ఆ సంపద కొద్దిమంది బడా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళుతుందన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ప్రత్యక్ష పనులను దేశంలో 30 నుంచి 20 శాతానికి తగ్గించారన్నారు. దీంతో ఏడాదికి కార్పొరేట్ శక్తులకు రూ. 1 లక్ష 45 వేలు కోట్లు ఆదాయం మిగులుతుందన్నారు. ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందన్నారు. పేదలు, సామాన్య ప్రజలు, ఉద్యోగ కార్మికులు బ్యాంకులలో దాచుకున్న సొమ్మును కార్పొరేట్ శక్తులకు రుణం ఇచ్చేలా మోడీ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచారన్నారు. రుణాలు తీసుకున్న కార్పొరేట్ శక్తులు తాము కట్టగలిగే స్థితిలో ఉన్న రుణాలు చెల్లించలేమని, చేతులెత్తేస్తే వాటిని రద్దు చేసేందుకు మోడీ ప్రభుత్వం అత్యుత్సాహం చూపిందన్నారు. ఏడాది తిరగకుండానే ఎగవేసిన వారికే తిరిగి మళ్ళీ రుణాలు ఇచ్చేలా అన్ని రకాల వసతులు కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 10 ఏళ్ల కాలంలో కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు ప్రజా ధనాన్ని దోచిపెట్టిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు పన్నుల రాయితీ, దివాళా ప్రకటనల ద్వారా రద్దు చేసిన మొత్తం రూ.25.50 లక్షల కోట్లు దేశ సంపదను కొల్లగొట్టారన్నారు.. 2014లో ముకేశ్ అంబానీ సంపద రూ. 1.42 లక్షల కోట్లు నుంచి 2024 నాటికి రూ. తొమ్మిది లక్షల కోట్లు పెరిగిందన్నారు. గౌతమ్ ఆదాని ఆదాయం గత పదేళ్ళ కాలంలో రూ. 43, 300 కోట్ల నుంచి రూ. 6.56 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. ధనవంతులపై పన్ను రేట్లు తగ్గించడమే కాకుండా కొద్దిస్థాయిలో సంపద పనులు 2015 లో అరుణ్ జైట్లీ పూర్తిగా రద్దు చేశారన్నారు. ప్రజా దోపిడీయే లక్ష్యంగా పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వానికి, ప్రజా సొమ్మును అప్పనంగా దోచుకుంటున్న కార్పొరేట్ శక్తుల దోపిడీ విధానాన్ని వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 9న నిర్వహించే క్విట్ కార్పొరేట్ ఉద్యమంలో రైతులు, రైతు కూలీలు, మేధావులు, సామాజికవేత్తలు, ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జుజ్జూరి జయంతి బాబు, పమిడి వెంకటరావు, సీనియర్ నాయకులు పెంట్యాల హనుమంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, ఎస్.కె.మాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, సిపిఐ(ఎంఎల్) నాయకులు నాగ రాజు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు పివిఆర్.చౌదరి, ఐఎఫ్టియు నాయకులు ఎంఎస్.సాయి, రైతు సంఘం జిల్లా నాయకులు మండవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్ ఆరోపించారు. సోమవారం సిపిఎం మండల కమిటీ సమావేశం ఎస్ తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసినా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలేవి వ్యతిరేకించలేదని అన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి ప్రత్యేక హోదా విషయం గాని, పోలవరం గురించి గాని ప్రస్తావనే లేదని, విశాఖ రైల్వే జోన్ తదితర విషయాలకు బడ్జెట్‌లో చోటు లేదని అన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చిన కేంద్రం పేదలను విస్మరించిందని అన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని, ఆహార భద్రత పథకానికి కూడా నిధులు తగ్గించారని, సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించారని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర విషయం కూడా బడ్జెట్ సమావేశంలో చర్చించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి హనీఫ్

వెనుకబడిన ప్రాంతాలను గుర్తించడంలో భాగంగా ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా చేర్చారు కానీ నిధులు కేటాయించలేదన్నారు. వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకత్వంలోని జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పనులు ఆపేశారని, దీని కారణంగా కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. తాగునీటి సమస్య తీవ్రతరం అవుతోందని, సాగర్ నీళ్లు ఇంటింటికీ కుళాయిల ద్వారా అందిస్తామని చెప్పిన మాటలు ఏ ప్రభుత్వమూ నిలబెట్టుకోలేదని అన్నారు. తాగునీటి కోసం నిధులు కేటాయించి మండలంలోని అన్ని గ్రామాలకు ఇంటింటికీ కొళాయిల ద్వారా రక్షిత నీరు సరఫరా చేయాలని కోరారు. మండల కేంద్రంలో గత 12 సంవత్సరాలుగా పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఉండడానికి ఇల్లు లేక ప్రభుత్వ స్థలాల్లో గత పది సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలపై పాలకులు, అధికారులు దౌర్జన్యంతో గుడిసెలు కూలగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇంటిస్థలాలు లేని పేదలకు స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం రత్నారెడ్డి, ఎస్‌కె అజీద్ బాషా, బక్క జేసురత్నం, అంకేపల్లి వెంకటేశ్వరరెడ్డి, జి ఏసుదాసు, కె బాలనాగయ్య, బి యేసురత్నం, కె థామస్ వై ముసలయ్య పాల్గొన్నారు.

ఎడాపెడా తొలగింపులు

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులు 600 మంది ఉండగా 50 మందికి తీసేశారు. మున్సిపల్ కార్మికులు 100 మందిని తప్పించారు. మధ్యాహ్నం భోజనం పథకంలో 1200 మంది నిరుపేద మహిళలుండగా ఇప్పటికే 350 మందిని తొలగించారు. మిగతా వారి పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారింది. ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అస్టిసెంట్లను 200 మందికి పైగా తీసేశారు. మరో 800 మందికి ఉపాధి గండం తప్పడం లేదు. ఇలా మార్చుకోవడానికి అవకాశం ఉన్న ప్రతి చిన్న ఉద్యోగాన్ని తెలుగుదేశం నేతలు లాగేసుకుంటున్నారు. కొత్తవారిని పెడుతున్నారు. ఇవన్నీ గ్రామాలనుంచి జాబితాలు మండలాలకు అక్కడ నుంచి ఎమెల్యే కార్యాలయానికి చేరు తున్నాయి. ఎమ్మెల్యేల సిఫార్సులతో వీరిని తొలగిస్తున్నారు. ఒకవేళ రాజకీయకోణం ఉంటే నిజంగా తమ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారిని గుర్తించి తప్పిస్తే అభ్యంతరం లేదు. అదేమీ చూడకుండా అందరినీ పేకేస్తున్నారు.అందరూ బాధితులుగా మిగిలిపోతున్నారు. వితంతు మహిళలను కూడా మానవత్వం లేకుండా పీకేస్తున్నారు. ఇదే ఆందోళనకరంగా ఉంది. ఏదేమైనా కూటమి నేతలు కళ్లు తెరవాలి.ప్రజలు తమకు అధికారం ఇచ్చింది చిరుఉద్యోగులపై ప్రతాపం చూపడానికా? అనేది ఆలోచించాలి.

సుప్రీంకోర్టు తీర్పుతో సంబరాలు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగల చేస్తున్న పోరాటాన్ని అర్థం చేసుకున్న భారత అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో మాదిగల 30 సంవత్సరాల పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నేలపాటి రాజు మాదిగ, కనిగిరి నియోజకవర్గం ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ రావినూతల కోటయ్య మాదిగ అన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇచ్చిన నేపథ్యంలో హనుమంతుని పాడు మండల కేంద్రంలో ఎస్సీ సెల్ నాయకులు కత్తి తిరుపాల్ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణతో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మాదిగలకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. జెపి రాజు మాదిగ, గూడూరు శేఖర్ మాదిగ, వేల్పుల రాజశేఖర్, మాసిపోగు వెంకటస్వామి, కత్తి కిషోర్, మాసిపోగు ఎర్రయ్య, కత్తి మత్తయ్య, రావినూతల కిషోర్ మాదిగ, చలికి నీటి రాజేష్, పరిశపోగు భాస్కర్, రావినూతల బాలయ్య మాదిగ, రోశయ్య మాదిగ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండల కేంద్రమైన సిఎస్‌పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఓ రాజాల కొండారెడ్డి పరిశీలించారు. పథకం ఎలా జరుగుతుందని పిల్లల్ని అడిగి తెలుసుకున్నారు. తగినంతమేర కందిపప్పు, నూనెలు, కూరగాయలు ఉపయోగించాలని, అలాగే పరిశుభ్రంగా వంట చేయాలని కుకింగ్ ఏజెన్సీ మహిళలకు సూచించారు. భోజనం విషయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా మెనూ ప్రకారం పిల్లలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె ఖాదరున్నీసా, జె భారతి ఉన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.65,522

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.65,522 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా రూ.31,020, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.23,270, శాశ్వత అన్నదానానికి రూ.11,232 వచ్చినట్లు ఆయన తెలిపారు.

భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఇఓ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి భవిత విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి యూవి నారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమంను సందర్శించి అందుతున్న వైద్య సేవలను పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకొన్నారు. కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విధులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఐఆర్పీలు గోపాలకృష్ణ, సైమన్, ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ జి పుల్లయ్య, ఆయా అబీబా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తులను రోడ్లు, కాలువలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి ప్రజల ఫిర్యాదు మేరకు పట్టణంలోని 17వ వార్డులోని ఆల్ఫా స్కూల్ బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రాంతంలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మున్సి పాలిటీ ప్రాంతంలో ఎవరైనా మున్సిపాలిటీకి సంబంధించిన ఆస్తులు కాలువలు, రోడ్లు, స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే ఆక్రమణదారులు ఎంతటి వారైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు.



ఆక్రమణలను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గఫార్

మున్సిపాలిటీ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అటు అధికారులు, ఇటు స్థానిక నాయకులు, ప్రజలపై కూడా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవకి రాజీవ్, శానిటరీ కార్యదర్శి ధూళిపాళ్ల రాజశేఖర్, డాక్టర్ నాయబ్ రసూల్ ఆజామ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

'వెబ్‌ల్యాండ్'తో ఇక్కట్లు

- రీసర్వే చేసిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ మూత
- స్పష్టత ఇవ్వని కొత్త ప్రభుత్వం
- రుణాలు అందక నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో ఇష్టానుసారంగా, సమగ్ర ప్రణాళికలు లేకుండా భూములను సర్వే చేసి అప్పటి ముఖ్యమంత్రి జగన్ బొమ్మలు ఉన్న హద్దురాళ్ల పాతడంతో రాజకీయ దుమారం చెలరేగింది. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల వివరాలు నమోదు చేయాల్సిన వెబ్‌ల్యాండ్ సర్వర్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. భూముల రిజిస్ట్రేషన్‌కు, బ్యాంకుల్లో రుణాలు పొందడానికి వెబ్‌ల్యాండ్‌లో వివరాలు తప్పనిసరి కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌ల్యాండ్ సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు బ్యాంకుల్లో వ్యవసాయ సంబంధిత లోన్లు పొందలేక ప్రైవేటు సంస్థల్లో అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని తీవ్రంగా నష్టపోతున్నారు.

వెబ్‌ల్యాండ్ ఆధారంగానే సబ్ రిజస్ట్రారు కార్యాలయంలో రిజస్ట్రేషన్‌లు జరుగుతాయి రీసర్వేలో అవకతవకలు జరిగాయని రైతుల నుండి ఫిర్యాదులు రావడంతో క్రొత్త ప్రభుత్వం రీసర్వే గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ సైటును మూసేసింది. దీంతో ఆ భూములు అవసరాలకు రైతులు అమ్ముకోవాలన్నా రిజస్ట్రేషన్ కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతులు రుణాలు పొందాలంటే..

రైతులు సాదారణంగా వ్యవసాయ సీజన్ ప్రారంభం కాగానే పాత రుణాలు రద్దు చేసుకోవడమో, రెన్యువల్ చేసుకొని కొత్తరుణాలు తీసుకోవడం జరుగుతూ ఉంటుంది. వెబ్‌ల్యాండ్ ఓపెన్ కాకపోవడంతో సబ్ రిజస్ట్రారు కార్యాలయంలో భూములు బాండు కావడంలేదు. సహకాం సంఘాల్లో భూములు బాండ్ ద్వారా తనఖా రిజస్ట్రేషన్ చేసుకొని రుణాలు ఇస్తారు. ప్రస్తుతం రీసర్వే జరిగిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ పనిచేయకపోవడంతో బాండ్లు రిజిస్ట్రేషన్ కావడంలేదు. దీంతో రైతులు వ్యవసాయ ఖర్చులకు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయించక తప్పడం లేదు. అదేవిధంగా భర్త చనిపోతే అతనికి సంబంధించిన భూములను భార్య పేరుతో మార్చుకోవాలన్నా వీలులేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ రైతులు తహశీల్దార్‌ను సంప్రదించగా కంప్యూటర్ తీసుకోవడం లేదని, కొత్త వెబ్‌ల్యాండ్ వచ్చేవరకు ఆగాల్సిందేనని సమాధానం ఇస్తున్నారు.

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

భూముల రీసర్వే పేరుతో గత వైసిపి ప్రభుత్వం జగన్న భూసర్వే పథకం తీసుకొచ్చింది. మండలంలోని కొత్తకోట, మద్దిరాల మూప్పాళ్ల, చేకూరపాడు, కండ్లగుంట, రాపర్ల, మట్టిగుంట, తదితర గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి జగన్ మోహన్ రెడ్డి బొమ్మలతో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో భూములు ఆన్‌లైన్లో మార్పులు, చేర్పులు జరగని పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించి ఎటువంటి ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. కొత్తగా భాగపంపిణీలు జరిగిన వారు భూములు రిజస్ట్రేషన్ చేయించుకున్నవారు వారిపేరు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిపై రైతుల నుండి అనేక ఆరోపణలు రావడంతో నూతనంగా వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం రీసర్వేను రద్దుచేసింది. కానీ రీసర్వే జరిగిన భూములపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. గత వైసిపి ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు పాటించకుండా రీసర్వేచేసి జగన్ బొమ్మతో ఉన్నరాళ్ళను పాతుకోవడానికి మాత్రమే ఉత్సాహం చూపారు. నూతనంగా వచ్చిన ప్రభుత్వం అయినా వెబ్‌ల్యాండ్‌పై సరైన స్పష్టత ఇస్తుందనుకుంటే అదీ జరగలేదు. దీంతో రైతాంగానికి ఇబ్బందుల తప్పడంలేదు ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రీసర్వేను రద్దు చేసినట్లుగా వెంటనే వెబ్‌ల్యాండ్‌పై నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి తమను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు

రైతుసంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని పాటిమీదపాలెంలో శంకరయ్యస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం రైతుసంఘం పాటిమీద పాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పమిడి వెంకటరావు మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే ప్రజల సౌకర్యార్ధం ఈ మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, రైతుసంఘం మండల నాయకులు కుమ్మిత శ్రీనివాసులరెడ్డి, గ్రామ కమిటీ నాయకులు మూలె రామాంజనేయరెడ్డి, క్రిష్టిపాటి శ్రీనివాసులరెడ్డి, క్రిష్టిపాటి బక్కిరెడ్డి, క్రిష్టిపాటి శ్రీనివాసులరెడ్డి, లక్కు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సేవలపై

పార్లమెంటులో ఎంపీ మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో నమోదైన మానసిక ఆరోగ్య సంంక్షణ సలహాదారులు సంఖ్య, మౌలిక సదుపాయాల పెంపుదలపై ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ గణ్‌పత్‌రావ్ సమాధానమిస్తూ దేశంలో నమోదైన మానసిక ఆరోగ్య సంరక్షణ సలహాదారుల సంఖ్యపై కేంద్రం ఎలాంటి నిర్వహణ చేయలేదని, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇచ్చిన సమాచారం ప్రకారం 3,551 మంది క్లినికల్ మానసిక వేత్తలు, 2,828 పునరావాస మానసిక వేత్తలు, 209 మంది పునరావాస అభ్యాసకులు నమోదు అయ్యారన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో తృతీయ సంరక్షణ భాగంలో 29 సమర్ధత ఉన్న సెంటర్లు మంజూరు చేశామన్నారు. వీటితో పీజీ విభాగ విద్యార్ధులకు మానసిక ఆరోగ్య ప్రత్యేకతలు, తృతీయ స్థాయి చికిత్స సౌకర్యాలపై అవగాహన పెరుగుతుందన్నారు. దీనికి తోడు, 47 పీజీ విభాగాలను బలోపేతం చేయటానికి ప్రభుత్వం 19 ప్రభుత్వ వైద్య కళాశాలల మద్దతు తెలిపిందని, మానసిక ఆరోగ్య సేవలు అందించటానికి 22 అఖిల భారత వైద్య శాస్త్ర సంస్థలతో పాటు పిఎం జన ఆరోగ్య యోజన పథకం అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలో వెనుకబడిన ప్రాంతాలలో మానసిక ఆరోగ్య సేవలు పెంచుటకు ఆన్‌లైన్ శిక్షణా తరగతులను కేంద్ర మానసిక వైద్య సంస్థలలో కల్పించిందన్నారు. కేంద్ర నిధులతో 747 జిల్లాలలో కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. 2022 లో ప్రారంభించిన జాతీయ టెలి మానసిక ఆరోగ్య కార్యక్రమంలో 36 రాష్ట్రాలు 53 టెలి మానస్ సెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు.

శింగరాయకొండ సర్పంచ్‌కు షాక్

చెక్ పవర్‌లో కౌంటర్ సిగ్నేచర్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ సర్పంచి తాటిపర్తి వనజకి జిల్లా పంచాయతీ అధికారులు షాక్ ఇచ్చారు. పంచాయతీ సర్పంచ్‌కు సంబంధించిన చెక్ పవర్‌లో కౌంటర్ సిగ్నేచర్‌గా ఒంగోలు డిఎల్‌పిఓకు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి ఉత్తర్వులను జారీ చేశారు. ఆ ఉత్తర్వులు డిఎల్‌పిఓకి, డిపిఒ కార్యాలయానికి, సబ్ ట్రెజరీ, జిల్లా ట్రెజరీ, మండల పరిషత్తు కార్యాలయానికి సోమవారం చేరాయి. గత సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేశారు. చెక్ పవర్‌ను కౌంటర్ సంతకముగా ఒంగోలు డిఎల్‌పిఓకు ఇస్తూ మరో ఏడు రోజుల్లో సమాధానం చెప్పాలని, సమాధానం చెప్పకపోతే పూర్తిస్థాయిలో చెక్కు పవర్ రద్దు చేస్తామని లేఖ పంపారు. వైసీపీ సర్పంచ్‌గా శింగరాయకొండకు చెందిన తాటిపర్తి వనజ రాష్ట్రంలోనే మెజార్టీలో మొదటి స్థానం సాధించారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో అధికారులు షాక్ ఇవ్వడం శింగరాయకొండలో చర్చనీయాంశంగా మారింది.



సిబ్బందికి సూచనలిస్తున్న ఐటిడిఎ పీవో రవీంద్రారెడ్డి

విద్యార్థులతో వంట చేయించిన వారిపై

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని గిరిజన గురుకుల సంక్షేమ బాలుర పాఠశాలలో ఐటిడిఎ పివొ డాక్టర్ బి.రవీంద్రరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల చేత సిబ్బంది వంట చేయిస్తున్నారని పత్రికల్లో రావడంతో స్పందించిన అధికారులు స్పందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట మనుషులతో విడివిడిగా మాట్లాడారు. చపాతీలు చేయడం కొంచెం ఆలస్యం అవుతున్నందు వల్ల ప్రతి ఆదివారం మాత్రమే కొంత మంది విద్యార్థులు వంట వారికి సహకరిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇక మీదట వంట పనుల్లో విద్యార్థులను వినియోగిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చపాతీలు వేగంగా తయారు చేసేందుకు ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన మిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వసతి గృహ సంక్షేమాధికారి జిత్యా నాయక్‌కు మెమో జారీ చేసినట్లు వివరించారు. ఈయన వెంట ఐటిడిఎ స్పెషల్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు పరిసర ప్రాంతాలలో మోటార్ సైకిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నటు గిద్దలూరు అర్బన్ సిఐ వై.వి.సోమయ్య తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.



నాటు సారాను ధ్వంసం చేస్తున్న అధికారులు

నాటు సారా బట్టీ ధ్వంసం

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం ఓబులాపురం తండా శివారులోని అటవీ ప్రాంతంలో సెబ్ అధికారులు దాడులు చేసి నాటుసారా బట్టీని ధ్వంసం చేశారు. అధికారుల రాకను గమనించిన ఒక వ్యక్తి పారిపోగా మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. 10 లీటర్ల నాటు సారా క్యాన్, మూడు ప్లాస్టిక్ డ్రమ్ములు, ఒక ఇనుప డ్రమ్ము, 800 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఒక ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సిఐ కొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్సై టి.ఫణి కుమార్, కానిస్టేబుళ్లు కె.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - కొమరోలు

కొమరోలు మండలంలోని బ్రాహ్మణపల్లి, తాటిచెర్ల గ్రామాలలో సోమవారం పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. బ్రాహ్మణ పల్లె సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి రూ.5,890 నగదును, తాటిచెర్ల గ్రామంలో మరో ఆరు మందిని అదుపులోకి తీసుకొని రూ.1,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు సంబంధించి ప్రజలకు సమాచారం ఉంటే 100కు ఫోన్ చేయాలన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి సత్తిబాబు మాట్లాడుతూ ఫిర్యాదులను పరిష్కరించి ప్రజలకు మంచి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక ప్రగతి నగర్, మర్రిచెట్టు కాలనీలో విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కటింగ్ కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుండి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డిఇఇ జి.వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిరుద్యోగుల తొలగింపు ఆపకపోతే ఉద్యమిస్తాం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - బాపట్ల

స్కీం వర్కర్లు, చిరు ఉద్యోగుల పట్ల రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపకపోతే ఉద్యమిస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బారావమ్మ హెచ్చరించారు. సిఐటియు ఆధ్వర్యంలో చిరు ఉద్యోగులపై అక్రమ వేధింపులు, తొలగింపులు ఆపాలని కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలుగు విఒఎలు, యానిమేటర్స్ పెద్దసంఖ్యలో తొలగింపుకు గురయ్యారని అన్నారు. ఆశ, మధ్యాహ్నం భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం మారింది కాబట్టి తమ కార్యకర్తలను మీ స్థానంలో నియమిస్తామని, మీరు రాజీనామా చేయండని స్థానిక అధికార పార్టీ నాయకులు యనిమేటర్లపై పెద్ద ఎత్తున ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాలో 90మంది యనిమేటర్లను తొలగించారని అన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిన వాగ్దానాన్ని మర్చిపోయారాని ప్రశ్నించారు. చిరు ఉద్యోగుల ధర్నా శిబిరాలకి వచ్చి, తాము వస్తే వేతనాలు పెంచుతాం, సంక్షేమ పాలన అందిస్తామని గొప్పలు చెప్పుకుని ఇప్పుడు స్థానిక అధికార పార్టీ నాయకులను అదుపు చేయక పోవడాన్ని చూస్తుంటే గత వైసిపికి పట్టినగతే మీకు పడుతుందని హెచ్చరించారు. చిరు ఉద్యోగులకు ఇచ్చే రూ.10వేల వేతనం కూడా నెలలు తరబడి బకాయిపెడితే ఎలా బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగు విభాగంలో రాజకీయ నాయకుల నుండి క్రింది స్థాయి అధికారులు వరకు ముడుపులు అందుతున్నాయని అన్నారు. ఎక్కడైనా అవినీతి బయటకు వస్తే మాత్రం యనిమేటర్‌ను బాధ్యురాలిని చేసి మిగిలిన వాళ్ళు తప్పించుకుంటున్నారని అన్నారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు కార్మిక వర్గాలను ఏకంచేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మణిలాల్, సిహెచ్ మజుందార్, ఐకెపి విఒఎ జిల్లా అధ్యక్షురాలు కె లక్ష్మి, కోశాధికారి జ్యోతి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎం వెంకటేశ్వరమ్మ, సిఐటియు నాయకులు శరత్, జె సామ్యూల్, బుచ్చిరాజు, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

సాగునీరు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు పంచాయతీలోని ఉత్తర సంఘం వద్ద గల కృష్ణ పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుండి చిన్న పులివర్రు వైపుకు పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువ ఊడిపోయి నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే చర్యలు చేపట్టి సాగునీరు అందే విధంగా చూడాలంటూ స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు. కాలువ పూడిపోవడం వలన సుమారు 30 ఎకరాలకుపైగా సాగునీరు అందక పొలాలు వేదపెట్టినప్పటికీ బీళ్లుగా మారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పూడికతీత చేపట్టి సాగునీరు విడుదలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, వేములపల్లి వెంకటరామయ్య, జి నాగరాజు, పి మనోజ్, ఆ ప్రాంత రైతులు పాల్గొన్నారు.



తహశీల్దారుగా నాగరాజారావు బాధ్యతల స్వీకరణ

తహశీల్దారుగా నాగరాజారావు

ప్రజాశక్తి - పంగులూరు

నూతన తహశీల్దారుగా డి నాగరాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో తిరుపతి తహశీల్దారుగా పనిచేసిన ఆయన అనంతరం బాపట్ల జిల్లాకు వచ్చారు. ఆయనను కలెక్టర్ వెంకటరమణ పంగులూరు తహశీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహశీల్దారు ఆదినారాయణ నుండి సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల ముందు వేమూరు తహశీల్దారుగా పని చేశారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.



కొణిజేటి చేనేత పురిలో ఎంఎల్ఎ కొండయ్య

సిఎం సభకు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - వేటపాలెం

ఈనెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న సందర్భంగా సభ ప్రాంగణాలను ఎంఎల్ఏ ఎంఎం కొండయ్య సోమవారం రాత్రి పరిశీలించారు. చేనేతపురి కాలనీ, జాండ్రపేట బివిఆర్ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. స్థలం ఎంపికపై అధికారులతో చర్చించారు. తన కార్యాలయం వద్ద హెలీప్యాడ్ ఏర్పాటుపై పరిశీలించారు. చేనేత కమిషనర్ సునీత ఆయా ప్రాంగణాలను మంగళవారం పరిశీలించి బహిరంగ సభ ఏర్పాటుకు వేదికపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. అధికారులు అందరూ సిఎం చంద్రబాబు పర్యటన విజయవంతం అయ్యేవిధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్ఐ జి సురేష్, టిడిపి నాయకులు జనార్ధనరావు, బుచ్చేశ్వరరావు, భరత్ పాల్గొన్నారు.

ఈనాం భూముల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న ఈ నాం భూముల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని లక్కవరం, జంగమహేశ్వరపురం గ్రామ రైతులతో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా లక్కవరం, అగ్రహారం పరిధిలో 565 ఎకరాల వ్యవసాయ భూమిని 390 మంది, జంగమహేశ్వరపురం, అగ్రహారంలో 2535 ఎకరాల్లోని వ్యవసాయ భూమిని 916మంది సన్న, చిన్నకారు రైతులు ఈనాం, ఎస్టేట్ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 2013నుండి పట్టాదారు పాసు పుస్తకాలు, యాజమాన్య హక్కు పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీ పథకాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బ్యాంకుల్లో రైతులకు వ్యవసాయానికి అవసరమైన రుణాలు మంజూరు కాక, పెట్టుబడులకు సరైన సమయంలో నగదు అందక ఇబ్బందులకు గురవుతు న్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లక్కవరం, జంగమహేశ్వరపురం గ్రామాల్లోని రైతులు ఎదుర్కొం టున్న భూముల సమస్య పరిష్కరించాలని తహశీల్దారు టి ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, రైతు సంఘం నాయకులు వి కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, రామాంజనేయులు, మోహనరావు, సూరిబాబు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు



నీటి శుద్ధి ప్లాంటును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నరేంద్ర వర్మ

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిసరాల పరిశుభ్రతతో ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులతో కలిసి పట్టణంలోని 26వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ను ఆయన సోమవారం పరిశీలించారు. వందరోజుల పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈనెల 15న తిరిగి ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. పూర్తయిన క్యాంటీన్ పనులపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణానికి త్రాగునీరు అందించే నీటి శుద్ధి ప్లాంటును పరిశీలిం చారు. కాలువలకు నీరు విడుదలవుతున్న నేపధ్యంలో చెరువును పూర్తిస్థాయిలో నింపి ప్రజలకు ప్రతిరోజు త్రాగునీరు అందించే చర్యలు చేపట్టాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు పట్టణానికి త్రాగు నీరు అందించే అంశంపై నిర్లక్ష్యం తగదన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, మున్సిపల్ పర్యావరణ ఇంజనీరు ఉమామహేశ్వరరావు, జనసేన ఇన్‌ఛార్జి నామన శివన్నారాయణ, టిడిపి అధ్యక్షులు గోలి పల్ల శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులోని అద్దేపల్లిలో నిర్మిస్తున్న ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్ మాట్లాడుతూ దళిత వాడను ఆనుకుని నిర్మిస్తున్న సెల్ టవర్ వలన భవిష్యత్తులో అనేక అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. దీని నిర్మాణం నిలిపేయాలని ఇటీవల గ్రామస్తులు అడ్డుకోవడంతో కొంతకాలం పనులు నిలిపివేశారని చెప్పారు. కానీ తిరిగి పంచాయతీ అనుమతి కావాలంటూ నిర్మాణదారులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసిందని సెల్ టవర్ నిర్మాణానికి అవసరమైన నిబంధనలు ప్రకారమే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వరాదని కోరారు. పంచాయితీ కార్యదర్శికి కూడా అనుమతులు ఇవ్వరాదని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. సూర్యపల్లి గ్రామానికి చెందిన బొర్రా శ్రీనివాసరావు ఇంటి వద్ద మురుగు విషయంలో మొర్ల శ్రీనివాసరావు అనే కానిస్టేబుల్ దౌర్జన్యంతో తమ నీటిని బయటకు రానివ్వకుండా బెదిరిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. పెదపులివర్రు అక్కివారిపాలెంలో రహదారుల ఆక్రమణతో రాకపోకలకు అంతరాయంగా మారిందని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గోళ్ళ నాగరాజు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సత్వరమే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ ఉషారాణి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు ఉన్నారు.



సెల్ టవర్ నిర్మాణం ఆపేయాలని ఫిర్యాదు

ట్రిపుల్ ఐటికి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు



షేక్ నస్రీన్

మండలంలోని అలవలపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి చదివిన షేక్ నస్రీన్‌కి ట్రిపుల్ ఐటీ సీటు లభించినట్లు పాఠశాల హెచ్ఎం స్వయంపు గోవిందరాజులు సోమవారం తెలిపారు. 561 మార్కులు సాధించిన నస్రీన్‌కి మొదటి విడతలోనే ట్రిపుల్ ఐటీ సీటు వస్తుందని భావించామని, అయితే 2వ విడతలో సీట్ లభించినట్లు తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని తెలిపారు. నస్రీన్ తండ్రి ఆటోలో చిరు వ్యాపారం చేస్తుంటాడని, పేదరికంలో ఉన్నప్పటికీ కష్టపడి చదివే గుణం ఉన్న నస్రీన్ మొదటి నుండి మంచి మార్కులు తెచ్చుకునేదని చెప్పారు. ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన నస్రీన్‌ని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సామాజిక సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామాల్లో ప్రజల సామాజిక సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని భర్తిపూడి కమ్యూనిటీ హాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో త్రాగు, సాగు నీరు, విద్య, వైద్యం, విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం కావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. సమావేశంలో తహశీల్దారు పి కృష్ణకాంత్, ఎంపిడిఒ విజయ్ శేఖర్, ఆర్డబ్ల్యుఎస్ డిఈ సురేష్, శ్రీనివాసులు, సర్పంచ్ ఆచంట అమరేష్, తెలుగుదేశం మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, ఇనగంటి గాంధీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - చిన్నగంజాం

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 11గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎస్‌విజికె మూర్తి తెలిపారు. ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

న్యాయం చేస్తారా..

ఆత్మహత్య చేసుకోమంటారా..?

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

న్యాయం చేస్తారా... ఆత్మహత్య చేసుకోమంటారా? అంటూ...బాధిత కుటుంబీకులు పురుగు మందు డబ్బాలతో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తమ భూములను అక్రమంగా కాజేశారని, తమ జీవనోపాధిపై వేటు వేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కాపురం మండల పరిధిలోని బోడపాడు గ్రామానికి చెందిన పోరెడ్డి ఓబులరెడ్డి, పోరెడ్డి నందిరెడ్డి అన్నదమ్ములు. వారు తమ భూమిని కాజేశారని బాధితులు ఆందోళనకు దిగారు. వారి తండ్రి ఓబులరెడ్డికి ఐదుగురు మగ సంతానం. అందులో పోరెడ్డి కాశిరెడ్డి అనే వ్యక్తి బాధితులిద్దరికీ అన్న. వీరికి మార్కాపురం మండల పరిధిలోని పెద్ద యాచవరం ఇలాఖాలో సర్వే నెంబరు 3/5లో ఎ.2.23 సెంట్ల విస్తీర్ణం



బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

పెద్దల నుంచి సంక్రమించింది. వారు వాటాలు పంచుకోగా బాధితులకు ఒక్కోక్కరికి ఎ.1.11సెంట్ల వచ్చింది. ఆ భూమికి స్వాధీన ఖరారు ద్వారా 2017 నవంబర్ 18న పెద్దల సమక్షంలో అగ్రిమెంట్ రాసుకున్నారు. అయితే భాగస్తులకు తెలియకుండా కాశిరెడ్డి అనే వ్యక్తి తన కుమార్తె ముక్కమళ్ల వరలక్ష్మి పేరుతో 2022 ఆగస్టు 28న రిజిష్టర్ చేశాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన వాటా దారులు దాన్ని ఆన్‌లైన్‌లో తొలగించాలని కోరారు. అయినప్పటికీ ఆలా చేయలేదు. అదేవిధంగా మార్కాపురం ఇలాఖాలో సర్వే నెంబరు 168/3ఎలో 0.25 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. ఈ భూమిని కూడా అక్రమంగా రిజిష్టర్ చేసుకున్నారు. తమకు హక్కుగా వచ్చిన భూమిని కూడా లాగేసుకోవడంతో తమ జీవనం గడిచేదెలా అని బాధితులు ఓబులరెడ్డి, నందిరెడ్డి కుటుంబీకులు ఆందోళనకు దిగారు. సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. మీది న్యాయమైతే మీ భూమి మీకు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యం

కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత డాక్టర్ కృష్ణ చైతన్య

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థుల బంగారు భవిష్యత్తే తమ లక్ష్యమనికిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అన్నా కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మార్కాపురం సమీపంలోని దేవరాజుగట్టు వద్దనున్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడారు. తమ కళాశాలలో అత్యున్నతమైన సాంకేతికత, విలువలతో కూడిన విద్య నందిస్తున్నామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. కిట్స్ కళాశాలలో చదివేందుకు ఎంపిక చేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థిని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలియజేశారు. తల్లిదండ్రులు కూడా నెలలో ఒకసారి తమ కాలేజిని సందర్శించ వచ్చన్నారు. మీ బిడ్డలు సక్రమంగా చదువుతున్నారా... కాలేజికి వస్తున్నారా లేదో పర్యవేక్షిస్తే మంచిదన్నారు. తమ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన విషయంలో రాజీపడబోమన్నారు. చదువులో రాణించాలని, ఆ తరువాత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెన్నా కష్ణారెడ్డి మాట్లాడుతూ బిటెక్‌లో ఉండే విధి విధానాలు, అకాడమిక్ యాంటీ ర్యాగింగ్ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఏవో బి.ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిల్‌కుమార్, వివిధ విభాగపు అధిపతులు రామ్మోహన్, డాక్టర్ అనిల్ కుమార్, కె.రాముడు, కిషోర్‌బాబు, ప్రసన్న మురళి, రమణారెడ్డి,అమతవల్లి, మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్‌రంగస్వామి, అంజనీ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నా కృష్ణచైనత్య

మాతా శిశు వైద్యశాలలో అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలకు వచ్చే రోగులు, వారి కుటుంబసభ్యులకు శివం ఫౌండేషన్ నిత్యాన్నదాన వాహనం ద్వారా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ సతీష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ మాతాశిశు వైద్యశాలకు ఎక్కువగా పేదలు వస్తుంటారని, రోగులతో పాటు వచ్చే వారి కుటుంబ సభ్యులకు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు ఫౌండేషన్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమంలో చిక్కాల కిరణ్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




అన్నదానం ప్రారంభిస్తున్న వైద్యులు..

వాలంటీరు వ్యవస్థపై అపోహలు వద్దు

మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు



వాలంటీరు వ్యవస్థపై టిడిపి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థను ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు ప్రతికల్లో వస్తున్న కథనాలను ఖండిస్తూ మంత్రి స్వామి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాలంటీర్ల భవిష్యత్ విషయంలో ఎన్‌డిఎ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన ఉద్యోగ భద్రత హామీ , మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాల విషయంలో టిడిపి వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. వాలంటీర్లు తమ భవిష్యత్ పట్ల ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. భయాందోళనకు గురి చేసేలా వస్తున్న తప్పుడు కథనాలను వాలంటీర్లు నమ్మవద్దని తెలిపారు. కుత్ర పూరిత కథనాలతో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే దుష్టచర్యలను ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వ సేవల ముసుగు వేసి వాలంటీరు వ్యవస్థను రాజకీయంగా వినియోగించు కున్నది వైసిపి పాలకులేనని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో వైసిపి రాజకీయ ప్రయోజనాల కోసం వాలంటీర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయించి దగా చేసిన విషయాన్ని మర్చిపోకూదని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే తెలుగుదేశం పార్టీ వాలంటీర్లకు ఎలాంటి అన్యాయం చేదన్నారు. ప్రజా ప్రభుత్వంపై అక్కసుతోనే వైసిపి ప్రచారం చేస్తున్న నిరాధరణ కథనాలు నమ్మి వాలంటీర్లు భయాందోళనకు గురి కావద్దని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకోని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అడినషల్ విఠలేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్‌పి టిపి.విఠలేశ్వర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలకు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. అడిషనల్ ఎస్‌సి స్వయంగా ఫిర్యాదుదారుల అర్జీలు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 55 మంది అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.సింగయ్య , ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి విఠలేశ్వర్



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంత్ రావు

పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టండి

కమిషనర్ జస్వంత్‌రావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఆస్తిపన్ను, నీటి పన్ను వసూళ్లపై దృష్టిపెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బందితో కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కమిషనర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాలంలో ఆస్తిపన్ను వసూలు విషయంలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 95శాతం ఖచ్చితంగా వసూలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకూ సచివాలయాల పరిధిలో పర్యటించి పన్నులు వసూలు చేయాలని సూచించారు. తక్కువ పన్ను ఉన్న భవనాలను గుర్తించి వాటికి పన్నులు విధించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భవనాలను కూడా ఆస్తిపన్ను పరిధిలోకి తీసుకు రావాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని షాపు రూములకు అద్దెలు వసూలు చేయాలని,షాపులు రెన్యువల్ చేయాలని సూచించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

11న విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకాశం బాలోత్సవ కమిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు సంబంధించిన కరప్రతాన్ని స్థానిక ఎల్‌బిజి భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ స్వాతంత్ర దితన్సోవం సందర్భంగా ఐదో తరగతిలోపు విద్యార్థులకు ఈనెల 11న ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో డ్రాయింగ్, వేషధారణ, దేశభక్తి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు ఈనెల 7లోపు 9490300412, 9848605205 నెంబర్లకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో పంపి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రకాశం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ రీజినల్ చైర్మన్ బండారు లక్ష్మీనారాయణ, జనవిజ్ఞానవేదిక పట్టణ అధ్యక్షుడు ఎస్‌వి. రంగారెడ్డి, కార్యక్రమ కన్వీనర్ నాయుడు మాల్యాద్రి, ప్రోగ్రాం మెంబర్ వినోద్ పాల్గొన్నారు.

'గుండ్లకమ్మ'కు సాగర్ నీరు

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మకు సాగర్ నీరు రానున్నట్లు ఇరిగేషన్ ప్రాజెక్టు ఎఇ రామాంజనేయులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు అవసరాలు, చెరువులను నింపేందుకు ఒక టిఎంసి వరకు సాగర్ నీరు గుండకమ్మ ప్రాజెక్టులోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గేట్లు మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

గుండ్లకమ్మకు చేరిన సాగర్ జలాలు

- పథకం నీటి పరిమాణం 31.13 క్యూసెక్కులు
- ఆయకట్టు 1245 ఎకరాలు
- సాగరు జలాలు ద్వారా పథకాలకు ప్రాణం పోసినట్లే
- ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యంతో రైతులుకు కష్టాలు

ప్రజాశక్తి - అద్దంకి

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే క్షేత్రస్థాయిలో రైతాంగం ఆర్థికంగా ఎదుగుదల ఉంటేనే ఆ గ్రామం అభివృద్ధి చెందుతుందని తద్వారా జిల్లా, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు లేక రైతుని ఇప్పటివరకు పంటలు వేసిన పరిస్థితి నెలకొంది. సాగర్ నీరు లేక, వర్షాలు సక్రమంగా కురవక రైతులు పరిస్థితి అత్యంత దయనీయంగా తయారయింది. మండలంలోని తిమ్మాయపాలెం గుండ్లకమ్మ ఎత్తిపోతల పథకం గత వైసిపి ప్రభుత్వంలో నిర్లక్ష్యపు నీడలో మిగిలింది. ఈ క్రమంలో ఎత్తిపోతల పథకం దగ్గర ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దొంగలు పగలగొట్టి దానిలోని రాగి తీగ చోరీ చేశారు.

గుండ్లకమ్మకు చేరిన సాగరు జలాలు

గుండ్లకమ్మకు సాగర్ జలాలు సోమవారం అధిక మొత్తంలో చేరాయి. దీంతో తిమ్మాయపాలెం, రామాయపాలెం, పార్వతీపురం, కోటికలపూడి గ్రామాల రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల్లో ఎత్తిపోతల పథకాల ద్వారా వరి పంట పండిస్తారు. నిన్న, మొన్నటి వరకు సాగర్ జలాలు గుండ్లకమ్మకు ఈ ఏడాది కూడా రావని, వరి పంట వేయలేమనే స్థితికి వచ్చారు. అదృష్ట వశాత్తు సాగర్ జలాలు రావడంతో ఎత్తిపోత పథకాల ద్వారా నీరు కాలువలకు వదిలితే నారు మడులు పెట్టుకోవ డానికి వీలుంటుందని రైతులు చెబుతున్నారు.

నిర్లక్ష్యపు నీడలో ఎత్తిపోతల పథకం

మాజీ ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి



తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం పంపు హౌస్

తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకాన్ని పునర్నిర్మాణం చేయించారు. రూ.5.28కోట్ల నిధులు ప్రభుత్వం ఖర్చుచేసి కొత్త మోటార్లు, ఇంటెక్ బావి నిర్మాణం, పంపు హౌస్, జాక్వెల్, ట్రాన్స్‌ఫార్మర్, 400కెవిఎ, డెలివరీ తొట్టి, గ్రావిటీ మెయిన్స్ ఏర్పాటు చేశారు.

మూడేళ్లుగా మూలన పడ్డ ఎత్తిపోతల

తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం గత మూడేళ్లుగా మూతపడింది. గుండ్లకమ్మలో నీరు లేకపోవడం అలుసుగా తీసుకొని ఆపేశారు. కొంతమంది గుర్తు తెలియని దొంగలు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్లను చోరీ చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎత్తిపోతల పథకం నిర్వహణ బాధ్యత ఎవరికీ ఇవ్వలేదు. గుండ్లకమ్మకు నీరు చేరడం మంచి పరిణామమైనప్పటికీ నీరు ఉన్నా ఎత్తిపోతల పథకం పనిచేయడం లేదు. దీంతో రైతులు ఆవేదనతో ఉన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని ఎత్తిపోతల పథకాలను మరలా గ్రామంలోని ఉత్సాహవంతులైన యువకులకు బాధ్యతలను అందించి రైతులకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. 31.13 క్యూసెక్కుల నీటి ద్వారా తిమ్మాయపాలెం, రామాయపాలెం, పార్వతీపురం దగ్గర్లోని కొంత భూమి వరిసాగ వుతుంది. రైతులకు ఆర్థికంగా లాభంతో పాటు, పశువులకు పశుగ్రాసం కొరత లేకుండా ఉంటుంది. గతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్వహించిన వైసిపి నాయకులు ఎకరాకు రూ.వెయ్యి చొప్పున నీటి తీరువా వసూలు చేసి జేబులు నింపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మోటార్లు మరమ్మత్తులకు గురైతే పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. ఎత్తిపోతల పథకం గతంలో గుండ్లకమ్మలో నీరు తక్కువగా ఉంటే పంపు సెట్లకు నీరు అందేది కాదు. పునర్నిర్మాణంతో తక్కువ స్థాయిలో నీరు ఉన్న పంపు హౌస్‌లోకి నీరు చేరే ఏర్పాటు చేశారు. 75హెచ్‌పి మోటార్లతో గుండ్లకమ్మ నుండి పంప్ హౌస్ ద్వారా టెక్ బావుల్లోకి నీరు చేరుతుంది. దీంతో దాదాపు 1200 ఎకరాల పైచిలుకు భూమికి సాగునీరు అందేలా చేశారు.

నీటి కోసం ఎదురు చూస్తున్నాం

తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తే నారు మడులు సాగు చేసుకొని మాగాణి సాగుకు సిద్ధం చేసుకుంటామని గ్రామానికి చెందిన రైతులు మండలపు శ్రీకాంత్, కాకాని హనుమంతరావు, తోకల విష్ణుమూర్తి చెబుతున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిలో వరి సాగుతో తిండి గింజలతో పాటు పశువులకు లభిస్తుందని అన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా మీరు విడుదల చేయాలని కోరారు.



గుండ్లకమ్మకు చేరిన సాగర్ జలాలు



అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - రేపల్లె

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాద వశాత్తు రాతి గోడలతో నిర్మించిన పూరిలు అగ్నికి ఆహుతైన సంఘటన సోమవారం ఉదయం పట్టణంలోని 16 వార్డు వేపాలమ్మ చెరువు వద్ద జరిగింది. అగ్నిమాపక శాఖ ఇన్చార్జ్ అధికారి సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం 16వ వార్డుకు చెందిన కట్ట సురేష్ గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయి రూ.1.50లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలు అదుపు చేశామన్నారు. సంఘటన స్థలాన్ని మాజీ కౌన్సిలర్ కరేటి శివకోటేశ్వరరావు, రెవిన్యూ అధికారులు పరిశీలించారు.



కళ్ళను పరిశీలిస్తున్న వైద్యులు

ఆపరేషన్లకు 475 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక జెడ్‌పి హై స్కూలులో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన కంటి పరీక్షలకు సంబంధించిన వారిలో కంటి శుక్లాల ఆపరేషన్ కొరకు 475మందిని వైద్యులు సిఫార్సు చేశారని ఇంకొల్లుకు చెందిన టిడిపి వాణిజ్య విభాగపు కార్యదర్శి పాలేరు రామకృష్ణ తెలిపారు. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాలకు తరలించి లేజర్ పద్ధతిలో కంటి శస్త్ర చికిత్సలు చేయించి ఉచితంగా కళ్ళజోళ్ళు, అవసరమైన మందులు అందించినట్లు తెలిపారు.



ఎంపిడిఓగా ఊహారాణి బాధ్యతల స్వీకరణ

ఎంపిడిఓగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన ఎంపిడిఓగా ఈఓపీఆర్డీగా పనిచేసిన టి ఊహారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన మల్లికార్జునరావు జులై 31న ఉద్యోగ విరమణ చేయటంతో అదే రోజు ఊహారాణికి ఎఫ్ఏసి బాధ్యతలు అప్పగించారు. ఆమెను ఎఒ జలజ, వివిధ శాఖల అధికారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది, మండల పరిషత్తు పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎపిఎం శ్రీమన్నారాయణ, ఎన్ఆర్ఈజిఎస్ ఎపిఓ శివపార్వతి, హౌసింగ్ ఎఈ సౌమ్య, రేవతి, సర్పంచ్ ధారా రవికిరణ్మయి, చెన్నయ్య, ఎంపీపీ డివి లలిత కుమారి, మల్లేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

సిఎం పర్యటనకు హెలీప్యాడ్ పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

సిఎం చంద్రబాబు బుధవారం చీరాల పర్యటనకు రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత దినోత్సవ సభ నిర్వహించనుంది. సభకు సిఎం చంద్రబాబు రానున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు సోమవారం సిఎం హెలీప్యాడ్‌కు అనువైన ప్రదేశం కోసం విఆర్ఎస్ అండ్ వై ఆర్ ఎన్ కళాశాల, పట్టణంలోని ఎస్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ ప్రాంగణాన్ని సోమవారం పరిశీలించారు.

ఫోకస్ ఐ కేర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని ఫోకస్ ఐ కేర్ కంటి ఆసుపత్రిలో అధునాతన లేజర్ టెక్నాలజీ కలిగిన కంటి శుక్లాల ఆపరేషన్ చేసే పరికరాన్ని రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆసుపత్రి సేవలను కొనియాడారు. తీర ప్రాంత ప్రజలకు ఇదొక మంచి అవకాశమని అన్నారు. ఫోకస్ ఐ కేర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల వైద్యులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో గుర్తించిన వారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేసేందుకు ఫ్యాకో పరికరం దోహద పడుతుందని అన్నారు. ఐ కేర్ డైరెక్టర్ కె కిషోర్ బాబు మాట్లాడుతూ రేపల్లెలో కంటి హాస్పటల్ ప్రారంభించి రెండేళ్లు కావస్తుందన్నారు. ఇప్పటి వరకు 13వేల మంది ఔట్ పేషెంట్లను పరీక్షించామని తెలిపారు. 1500లకుపైగా కంటి శుక్లాల ఆపరేషన్లు చేశామని అన్నారు. తీర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో జిల్లాలో ఎక్కడా లేని



ఫ్యాకో పరికరం ప్రారంభిస్తున్న శివప్రసాద్

కంటి వైద్యానికి సంబంధించి ఫ్యాకో మిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. శుక్లాలను కంటి నొప్పి, కుట్టు, కట్టు, కోత లేకుండా లేజర్ ద్వారా కంప్యూటర్ పద్ధతిలో చేయవచ్చని అన్నారు. పేషెంట్‌కు కంటిలో ఎటువంటి సమస్య ఉన్న పరిష్కరించవచ్చని అన్నారు. శుక్లాలు బాగా ముదిరిన వారికి, ఈ మిషన్ ద్వారా ఆపరేషన్ చేసి మంచి చూపు ఇవ్వవచ్చని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ అఖిల, డాక్టర్ రమేష్, మార్కెటింగ్ మేనేజర్ విజయ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో చందలూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర స్థాయి 49వ యోగాసన పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున వివిధ వయోపరిమితుల ఆధారంగా జరిగిన పోటీల్లో మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. మూడు విభాగాల్లో ప్రథమ స్థానాన్ని సాధించారు. 2024 యోగ అసోసియేషన్ మీట్ 49వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు ఆదివారం ఒంగోలులోని పివిఆర్ హైస్కూల్లో జరిగాయి. ఈ పోటీల్లో 10 – 12ఏళ్ల విభాగంలో పాఠశాలకు చెందిన అమ్మిశెట్టి లిఖిత, 12 – 14ఏళ్ల బాలికల విభాగంలో నాయపాము శృతి, 12 – 14 ఏళ్ల బాలుర విభాగంలో మంగిశెట్టి వెంకటేష్ మొదటి స్థానాన్ని సాధించాడు. హెచ్ఎం చందలూరు గిరిజ అధ్యక్షతన సోమవారం అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన యోగాసన పోటీల్లో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రథమ స్థానాలు సాధించటం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇది పాఠశాలకు,



యోగా విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు, గ్రామానికి గర్వకారణమని అన్నారు. విద్యార్థులు ఆట పాటలతో పాటు చదువుపై కూడా ప్రత్యేకమైన దృష్టి పెట్టి క్రమ శిక్షణగా చదువుకోవాలని చెప్పారు. మంచి ఫలితాలు సాధించాలని కోరారు. సమావేశానికి గ్రామ పెద్దలు అడ్డగడ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. శిక్షణ ఇచ్చిన పిడి కొండా ప్రతిమను అభినందించారు.



పిల్లలతో కలిసిపోయి బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

టీచర్‌లా కాదు.. తల్లిలా.!

ప్రజాశక్తి - పంగులూరు

పాఠశాలలో విద్యార్థులతో పాటు ఆమె కూడా ఒక విద్యార్థి. విద్యార్థులతో పాటు ఆమె కూడా నేలపైనే కూర్చుంటుంది. విద్యార్థులతో ఆడుకుంటుంది. వారికి దాహం వేస్తే ఆమె తెచ్చిస్తుంది. వాళ్ల బూట్లు ఊడిపోతే సాక్సులు తొడిగి బూట్లు వేస్తుంది. ఆమె పాఠశాల ఉపాధ్యాయురాలు అడ్డగబొట్లు క్రాంతి కళ. మండలంలోని కొండ మంజులూరు గ్రామ దళితవాడలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు. టీచర్‌లా కాకుండా తల్లిలా వారి యోగక్షేమాలు చూస్తోంది. గత ఏడాది కాలం వరకు విద్యార్థులు ఉపాధ్యాయులతో కళ కళలాడిన ఆ పాఠశాల గత ప్రభుత్వ విధానం కారణంగా ఆ పాఠశాల ఇప్పుడు ఏకోపాధ్యాయ పాఠశాలగా మారింది. ఒకటి, రెండు తరగతులకు చెందిన 22మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అందులో 1వ తరగతి విద్యార్థులు 14మంది కాగా, 2వ తరగతి విద్యార్థులు 8మంది. ఈ విద్యార్థులంతా అంగన్ వాడి సెంటర్ నుండి వచ్చిన వాళ్ళు కావడంతో వారిని గోల చేయకుండా, ఏడవకుండా చేసి వారికి చదువు చెప్పటం సామాన్యమైన పని కాదు. అయితే ఉపాధ్యాయు రాలు క్రాంతి కళ ఎంతో సహనంతో, వారికి చదువు చెబుతున్నారు. వారిలో ఒకరిగా కలిసి పోతున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. వారితో పాటు కింద కూర్చుని వారికి నచ్చచెబుతూ, వారిలో ఒకరుగా పనిచేయటం చాలా ఆనందంగా ఉందని 'ప్రజాశక్తి'తో క్రాంతి కళ చెప్పింది. విద్యార్థులతో మమేకమై వారికి అనుగుణంగా ఉంటూ పాఠాలు చెప్పటం తనకు సంతృప్తికరంగా ఉంటుందని ఆమె చెప్పారు. భోజనం సమయానికి విద్యార్థులతోనే కూర్చుని ఆమె కూడా భోంచేస్తుంది. ఆమె కూడా ఒక విద్యార్థిగానే ఆ పాఠశాల్లో కలిసిపోయి పనిచేస్తుంది.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - బాపట్ల

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. తల్లి, తండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే కార్యకర్తలపై ఎంతో నమ్మకంతో పంపిస్తున్నారని అన్నారు. వారిని కన్న బిడ్డల కంటే మిన్నగా చూసుకోవాలని అన్నారు. ఆట, పాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని అందజేయాలని కోరారు. సమయ పాలన పాటిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచి వచ్చే పిల్లల సంరక్షణకు ఎంతో బాధ్యతగా ఉండాలని అన్నారు. ఆయాలు చిన్నారులను ఇంటి వద్ద నుంచి తీసుకురావడంతో పాటు అంతే బాధ్యతతో వాళ్ళ తల్లుల దగ్గరికి తిరిగి చేర్చాలని అన్నారు. గర్భిణీలు, బాలింతల కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పరిష్కారం మార్గం చూపుతానని హామీ ఇచ్చారు. కొందరు అంగన్‌వాడీలపై చిన్న, చిన్న అభియోగాలు వస్తున్నాయని అన్నారు. అటువంటివి రాకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని చెప్పారు. బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు భవనం సమావేశాలకు చాలడం లేదని, పై అంతస్తు నిర్మాణం చేయించాలని ఆయనను అంగన్వాడీలు కోరారు. తక్షణమే దానికి సంబంధించిన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు ఆయన అన్నప్రాసన చేశారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. తహశీల్దారు పి కృష్ణకాంత్, ఎంపిడిఒ విజయ్ శేఖర్, ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీపార్వతి, జనసేన నాయకులు శివన్నారాయణ, గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న నరేంద్ర వర్మ

రేపల్లె : మండలంలోని బేతపూడి, పిరాట్లంక, అడవిపాలెం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆర్ వెంకట రత్నమ్మ, హెల్త్ డిపార్ట్‌మెంట్ సుబోసన్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతి రాజ్ శాఖ సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లి ముర్రుపాలు బిడ్డకు పట్టించాలని తెలిపారు. ముర్రుపాలు అమృతం లాంటివని అన్నారు. తల్లి పాలు సంపూర్ణ ఆహారమని అన్నారు. బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. బిడ్డకు 6నెలలు తల్లి పాలే సంపూర్ణ ఆహారమని అన్నారు. 6నెలలు దాటిన తరువాత అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్ రజిని, పి నాంచారమ్మ, అంగన్‌వాడి కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని పూనూరు అంగన్‌వాడీ సెంటర్ నందు తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లుల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుజాత మాట్లాడుతూ తల్లి పాలు మొదటి టీకాలాగా పని చేస్తుందని తెలిపారు. ఆరు నెలలు పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని, ఏడవ నెల నుండి అనుబంధ ఆహారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్ కొండమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది రత్న కుమారి, కోటేశ్వరమ్మ, వసంత లక్ష్మి, నవమ్మ, రామాదేవి, ఆశా కార్యకర్త భారతి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచి

అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి చేయండి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రామన్నపేట పంచాయితీలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఏడు అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ బట్ట అనంతలక్ష్మి, లీలప్రసాద్ గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీలోని ఏడు ఎస్టీ కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు.



ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో యువకుడు మృతి

కారు ఢీ కొని యువకుడు మృతి

ప్రజాశక్తి - అద్దంకి

కారు - టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని బలంగా ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా సీతా నాగవరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన జిత్తుగా చిట్టి బాబు (32) హరిబాబు అనే ఇరువురు టీవీఎస్ ఎక్సెల్‌పై చక్రాయపాలెం మూలమలుపు వద్ద క్రాస్ అవుతున్న సమయంలో కారు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. చిట్టిబాబు, హరిబాబు ఇరువురు ఆ ప్రాంతంలో పొగనారు ముళ్ళు పనుల కోసం తూర్పు గోదావరి జిల్లా నుండి వచ్చారు. ప్రమాదంలో చిట్టిబాబు మృతి చెందడంతో బంధువులు శోకసముద్రంలో మునిగారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రునికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రూ.9లక్షల విరాళం అందజేస్తున్న గిరిజా రాయుడు

స్మశాన అభివృద్ధికి రూ.9 లక్షల విరాళం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారు. స్థానికులతో పాటు సొంత ఊరు కాకపోయినా పర్చూరు కోర్టులో నాలుగేళ్ళ న్యాయవాది వృత్తి నిర్వహించి హైదరాబాదులో నివాసం ఉంటున్న పల్ల గిరిజారాయుడు తన భర్త పెద్ద సుబ్బారాయుడు జ్ఞాపకార్థం పర్చూరు స్మశానవాటికలో నిర్మిస్తున్న పసుపు కుంకుమల భవన నిర్మాణానికి రూ.9లక్షల విరాళం అందజేసి తమ దాన గుణాన్ని చాటుకున్నారు. మహాప్రస్థానం పనులు శరవేగంగా సాగుతున్నాయి. పర్చూరుకు చెందిన వాణిజ్య శాఖలో ఉన్నత ఉద్యోగం నిర్వహించి హైదరాబాదులో ఉంటున్న మరో దాత కూనపరెడ్డి వీరాంజనేయులు రూ.15లక్షల విరాళం ప్రకటిస్తూ తొలి విడతగా రూ.ఒక లక్ష నగదును అందజేసినట్లు స్మశాన వాటిక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు దాతలు అందించే సహకారం మరువలేనిదని అభినందించారు. దాతల సహకారంతో గ్రామంలో మరిని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామం నుండి విదేశాలకు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వ్యక్తులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కటారి సురేంద్రబాబు, ఎం కోటేశ్వరరావు, ఓ నరసింహం, కె శ్రీనివాసరావు, న్యాయవాది ఒగ్గిశెట్టి గోవిందరాజులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

గుంటూరులో అడ్వకేట్ కమీషనర్‌పైన తప్పుడు క్రిమినల్ కేసుకు నిరసనగా బాపట్లలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరిలో ఒక న్యాయవాదిని తన క్లయింట్‌కు బెయిల్ వేసినందుకు కేసులో పేరు పెట్టారని ఖండిస్తూ గుంటూరు బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు బాపట్లలో న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదని అన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, నాగార్జునసాగర్ నిండు కుండలా మారాయని, దీంతో లంక గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందని ఆర్‌డిఒ హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు తహశీల్దార్ల తోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వరద విపత్తు నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యారేజీకి వరద నీటిని సముద్రంలోకి వదిలే సమయంలో దిగువున ఉన్న లంక గ్రామాలకు వరద విపత్తు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణా నదికి ఎనిమిది లక్షల క్యూసెక్కుల పైగా వరద నీరు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంత గ్రామాల్లో ప్రజలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వరద బాధితులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. భోజన వసతి కల్పించేందుకు అవసరమైన సామాగ్రి, గ్యాస్ సదుపాయాలతో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడిన అసౌకర్యం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల తరలింపునకు పడవలు ఏర్పాటు చేసుకోవాలని, మంచి నీటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు వరదల కారణంగా ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు బంధువుల సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు ముందుగానే తరలి వెళ్లాలని అన్నారు. సచివాలయ ఉద్యోగుల విధుల్లో పాల్గొని లంక గ్రామాల్లోని కుటుంబాల సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఐదు లక్షల క్యూసెక్కుల నీరు వస్తే పెనుమూడి, పల్లెపాలెం ముంపుకు గురవుతుందని అన్నారు. అక్కడ నివసిస్తున్న వారికి పెనుమూడిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో రేపల్లె, కొల్లూరు తహశీల్దార్లు ఎం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రేపల్లె, కొల్లూరు ఈఒపిఆర్డి మల్లికార్జునరావు, లక్ష్మి కుమారి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేలా షారోన్

గ్రామాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామ అభివృద్ధికి రూ.4కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధంచేసి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ద్వారా ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. భట్టిప్రోలు విరలేశ్వర నగర్లో సిమెంటు రోడ్డుకు రూ.40లక్షలు, అద్దేపల్లి దళితవాడలో సిమెంట్ రోడ్డుకు రూ.10లక్షలు, భట్టిప్రోలులో సిమెంటు రోడ్డుకు రూ.10లక్షలు కలిపి రూ.60లక్షలతో సిమెంటు రోడ్డ నిర్మాణంనకు, కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు సరఫరాకు రక్షిత మంచినీటి సరఫరా పథకంనకు 20కిలోమీటర్ల పైపులైన్ల పునరుద్ధరణకు రూ.1.50కోట్లు, అద్దేపల్లిలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణంకు రూ.30లక్షలు, భట్టిప్రోలు రక్షిత మంచినీటి సరఫరా పథకం పునరుద్ధరణకు రూ.75లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సాధారణ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు భట్టిప్రోలు అభివృద్ధికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ద్వారా నిబద్ధతతో కృషి చేస్తానని తెలిపారు. ప్రతిపాదనలు గ్రామీణ నీటి సరఫరా సహాయక ఇంజనీర్ ఎన్ శివరామకృష్ణ, పంచాయతీ రాజ్ ఎఇ రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు చేశారని తెలిపారు.



మాట్లాడుతున్న తూనుగుంట్ల సాయిబాబా



ఆలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న జడ్జి దంపతులు

త్రివిక్రమ స్వామిని దర్శించుకున్న జడ్జి శాంతి

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి పి శాంతి చెరుకూరులోని శ్రీ త్రివిక్రమ, శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయాలను సోమవారం సందర్శించుకున్నారు. జడ్జి దంపతులు, తమ కుమార్తెతో కలిసి ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మేయర్ అంతరంగమేమిటో.?

- ఎమ్మెల్యే దామచర్లతో గంగాడ సుజాత రహస్య భేటీ..?
- మేయర్ భేటీ వెనుక మర్మమేంటని కార్పొరేటర్లలో చర్చ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఒంగోలులో తెలుగుదేశం పార్టీ నుంచి ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్ధన్ గెలవడంతో కార్పొరేషన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఎన్నికల సమయంలో వైసిపికి చెందిన పలువురు కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరికొంత మంది టిడిపి కుండువా కప్పుకున్నారు. వైసిపి పార్టీకి చెందిన డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, మరికొంత మంది కార్పొరేటర్లు కొద్ది రోజుల కిందట ఎమ్మెల్యే జనార్ధన్‌ను కలిశారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు వారు సుముఖంగా ఉన్నారని వారి కలయికతో స్పష్టమైంది. ఇదిలా ఉంటే తాజాగా నగర మేయర్ గంగాడ సుజాత ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో రహస్యంగా భేటీ అయ్యారని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. మేయర్ సుజాత మూడు రోజుల కిందట హైదరాబాద్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను ఆయన నివాసంలో కలిశారని తెలిసింది. ఈ సందర్భంగా వారి మధ్య రాజకీయంగా పలు విషయాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేయర్‌ను ఆ స్థానం నుంచి తప్పిస్తారన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. అయితే మేయర్‌ను నాలుగు సంవత్సరాలు పాటు తప్పించడానికి వీలులేదని జీవోలు చెబుతున్నాయి. ఈ పాటికే మేయర్ పదవీకాలం సుమారు ముడు సంవత్సరాలపై గానే ముగిసింది. ఈ క్రమంలో ఇప్పట్లో మేయర్‌ను ఆ స్థానం నుంచి తప్పించడం సాధ్యం కాని పక్షంలో ఆమెను టిడిపిలో చేర్చుకోవడం ద్వారా ఒంగోలు కార్పొరేషన్ పాలకవర్గ పగ్గాలు వారి చేతిలోకి తీసుకోవడం తెలుగుదేశం పార్టీ నేతలకు ఉన్న వెసులుబాటు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అదే ఫార్ములాను అమలు చేస్తున్నారని రాజకీయంగా చర్చ జరుగుతోంది. మేయర్‌ను తెలుగుదేశం పార్టీలోకి తీసుకోవడం ద్వారా కార్పొరేషన్ పాలనను తెలుగుదేశం పార్టీ ఆధీనంలోకి తీసుకునేందుకు జనార్ధన్ పావులు కదుపుతున్నారని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మేయరే నేరుగా జనార్ధన్‌ను కలవడం ఒంగోలు రాజకీయాల్లో కీలక పరిణామం. జనార్ధన్‌ను కలిసేందుకు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి మీద ఇటీవల తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్న మాజీ వైసిపి నేత, ప్రస్తుత టిడిపి నాయకుడిని మేయర్ వెంటపెట్టుకు పోయారని తెలిసింది. ఈ వ్యవహారం కార్పొరేషన్ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. అసలు మేయర్ మదిలో ఏముందనేది మరికొద్ది రోజుల్లోనే తేలనుందని పలువురు కార్పొరేటర్లు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయంగా మేయర్, ఎమ్మెల్యే మధ్య ఏం ఒప్పందాలు జరిగాయనే విషయంమీద కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మేయర్ పార్టీ ఫిరాయిస్తే కార్పొరేషన్ రాజకీయాలు మలుపులు తిరిగే అవకాశం ఉంది.



మేయర్ గంగాడ సుజాత (ఫైల్)



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అమరావతి సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో పాల్గొన్న ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు ఏ.తమీమ్ అన్సారియా, వెంకటమురళి..

ప్రభుత్వం మంజూరు చేయగానే పథకాలు అందిస్తాం..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

'పశు పథకాలకు బ్రేక్' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రిలో ఈ నెల 4న కథనం ప్రచు రితైంది. దీనికి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె బేబీరాణి స్పందించారు. పశు సంవర్ధక శాఖలో రాయితీపై 2019కి ముందు సమీకృత దాణా, పాతర గడ్డి, టిఎంఆర్, జొన్న, సొప్ప అవసరమైన రైతులకు సరఫరా చేశామన్నారు. 2019 తర్వాత ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయం మేరకు పథకం నిలిపివేశారని, ప్రభుత్వం తిరిగి పథకాలను ప్రారంభించగానే పంపిణీ చేస్తామని తెలిపారు.

టెండర్లు పిలుస్తాం..

ప్రజాశక్తి-పుల్లలచెరువు

'కాలువ సాగదు..కరువు తీరదు' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో జులై 30న కథనం ప్రచురితమైంది. దీనికి వెలుగొండ ప్రాజెక్టు మార్కాపురం డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు పి పురార్ధనరెడ్డి స్పందించారు. భూ కొలతలు పూర్తి చేసిన తర్వాత కాలువ ప్రారంభించుటకు త్వరితగతిన టెండర్లు పిలిచి కాలువ పనులు పూర్తి చేయుటకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిరుద్యోగుల తొలగింపును ఆపాలి

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న చిరుద్యోగులను తొలగించే కార్యక్రమాన్ని వెంటనే ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. చిరుద్యోగుల తొలగింపును నిరసిస్తూ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ, ఆశా, విఒఎ, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్కూల్ స్వీపర్లు, వివిధ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను రాజకీయ కారణాలతో తొలగిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవచేస్తున్నారని తెలిపారు. పాలక ప్రభుత్వాలు స్కీం వర్కర్లకు, చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించలేక పోతున్నారని వివరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ కారణాలతో చిరుద్యోగులు వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్కర్లపై వేధింపులు పెరిగాయన్నారు. మండల స్థాయి అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా 300 మంది విఒఎలు, 375 మంది మధ్యాహ్న బోజన కార్మికులు, 50మంది స్కూల్ స్వీపర్లు, 200మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 100 మంది మున్సిపల్ కార్మికులు, 15 మంది స్వచ్ఛ భారత్ కార్మికులు, 25 మంది గ్రామ పంచాయతీ వర్కర్లను ఈపాటికే తొలగించారని తెలిపారు. ప్రభుత్వ జీవోలకు అనుకూలంగా అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన ప్రమోషన్లను ఒంగోలు ప్రాజెక్టు పరిధిలో అధికారులు వెనక్కి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి, సిఐటియు నాయకులు పి.కల్పన, టి.రాము, పి.ఆంజనేయులు, డి.మహేష్, సుబ్బారావు, సుబ్బమ్మ, బసవపున్నయ్య, అన్వర్, ఆర్.మాలకొండయ్య, ఆనంద్, తంబి శ్రీనివాసులు, వి. మోజేష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న చిరుద్యోగులు, నాయకులు

నిర్ణీత కాలపరిమితి లోపు విచారణ చేయాలి

ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా ఫిర్యాదులను నిర్ణీత కాలపరిమితి లోపు విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా అదనపు ఎస్‌పి కె.నాగేశ్వరరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 73 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదులను పరిష్కరించుటకు ఎస్‌పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు, అదనపు ఎస్‌పి (క్రైమ్) యస్‌వి.శ్రీధర్ నిర్వహించారు. ఫిర్యాదులపై సంబంధి పోలీస్ స్టేషన్ల అధికారులతో ఏఎస్‌పి మాట్లాడి అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు దిశా సీఐ షేక్ ఖాజావలి, ఎస్‌సి, ఎస్‌టి సెల్ సిఐ ఏవి రమణ పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న ఏఎస్పీ కె.నాగేశ్వరరావు